క్లుప్తంగా

కొనసాగుతున్న వీరబ్రహ్మేంద్రస్వామి పూజలు

నేడు కల్యాణోత్సవం



వీరబ్రహ్మేంద్రస్వామి

సింహాచలం: శ్రీ కామాక్షి ఏకాంబరేశ్వర సనాతన ధర్మ పీఠం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సింహాచలం పుష్కరిణి సత్రం ప్రాంగణంలో శ్రీమద్ విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి జయంతి మహోత్సవాలు మూడోరోజు శుక్రవారం కొనసాగాయి. ఉదయం నిత్య పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి కీర్తనలు ఆలపించారు. సాయంత్రం 4.30 గంటల నుంచి అమ్మవారి కుంకుమ పూజ చేశారు. భాగంగా శనివారం ఉదయం నిత్యపూజ, సాయంత్రం 4.30 గంటల నుంచి స్వామివారి కల్యాణోత్సవం జరుగుతాయని కామాక్షి ఏకాంబరేశ్వర సనాతన ధర్మపీఠం సేవా ట్రస్ట్ ప్రతినిధి సాంబమూర్తి తెలిపారు. భక్తులంతా కల్యాణోత్సవంలో పాల్గొని తరించాలని పిలుపునిచ్చారు.

అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ముత్తంశెట్టి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో భ్రమరాంబ అందజేశారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

పరవాడ: దళాయిపాలెంలోని ఎమ్మెల్యే అతిథి గృహంలో శనివారం ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అధ్యక్షతన మండల వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సాధికార బస్సు యాత్రపై పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సలహాలు సూచనలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. సమావేశంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు పాల్గొంటారని తెలిపారు. మండలంలో పార్టీ ముఖ్య నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోన కోరారు.

అప్పన్నను దర్శించుకున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం అందజేశారు.

బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్‌గా గొర్లె



గొర్లె రామునాయుడు

పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌గా గొర్లె రాము నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి ఉత్తర్వులు జారీ చేసినట్లు రామునాయుడు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి



నాగదేవతకు అభిషేకం చేస్తున్న స్వామీజీలు



పుట్టలో పాలు పోస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి కుటుంబ సభ్యులు

సింహాచలం: నాగుల చవితిని శుక్రవారం జీవీఎంసీ 93, 98వ వార్డుల్లోని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కుటుంబసమేతంగా పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రుడికి పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు, చిమ్మిలి, చలివిడి, గుడ్లు వేశారు. టపాసులు కాల్చారు.98వవార్డులోని సింహగిరి ఫలసాయం తోటలు, భైరవవాక, దేవస్థానం పూలతోట, విజినిగిరిపాలెం, పాత అడవివరం, గోశాల లేఅవుట్, సింహపురికాలనీ, సింహపురి లేఅవుట్ తదితర ప్రాంతాల్లోని పుట్టల వద్దకు పెద్ద ఎత్తున భక్తులు తరలివెళ్లారు. అలాగే 93వ వార్డులో బాలాజీనగర్, ప్రహ్లాదపురం, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల్లో భక్తులు నాగుల చవితిని విశేషంగా జరుపుకున్నారు.

శారదాపీఠంలో...

నాగుల చవితి సందర్భంగా చినముషిడివాడలోని శ్రీశారదాపీఠంలో నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా నాగదేవతకు పంచామృతాభిషేకాలు జరిపారు.

పరవాడలో..

పరవాడ: నాగుల చవితి వేడుకలను మండల ప్రజలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు తన కుటుంబ సభ్యులతో పరవాడలో నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు.జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు , వాడచీపురుపల్లిలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు తన కుటుంబ సభ్యులతో పుట్టలో పాలు పోశారు. రావాడ, వెన్నలపాలెం, కలపాక, పి.బోనంగి, తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం, తానాం, పెదముషిడివాడ తదితర గ్రామాల ప్రజలు నాగుల చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. నూతన దుస్తులను ధరించి పుట్టల వద్దకు చేరుకొని నాగదేవతకు ప్రసాదం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సింహాచలం పూలతోటలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సింహగిరి ఘాట్‌రోడ్డులో పుట్టవద్ద భక్తుల పూజలు

సబ్బవరంలో...

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం నాగేంద్రునికి పూజలు నిర్వహించారు. నూతన వస్త్రాలను ధరించి,కుటుంబ సభ్యులతో పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేశారు.నాగేంద్రునికి పూలు,వస్త్రాలు సమర్పించి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.రావలమ్మపాలెంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు,సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, గుల్లేపల్లిలో ఎంపీపీ బోకం సూర్యకుమారి తదితరులు గ్రామస్తులతో కలిసి పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహించారు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో నాగుల చవితిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిపారు. నాగదేవతకు ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి నాగమ్మను ఆరాధించారు. చిమ్మిలి, చలిమిడి, గుడ్లు నైవేద్యంగా అందించారు. పలు చోట్ల వనభోజనాలు ఆరగించారు.



పెందుర్తి గ్రామీణ ప్రాంతంలో పూజలు చేస్తున్న భక్తులు



రావలమ్మపాలెంలో పూజలు చేస్తున్న చొక్కాకుల వెంకటరావు తదితరులు



పెదనాయుడుపాలెంలో నాగేంద్రునికి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

పెందుర్తిలో ఆధ్యాత్మిక సౌరభం



స్వామీజీని సత్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



స్వామీజీకి కిరీటం బహూకరిస్తున్న స్వాత్మానందేంద్ర

- శారదాపీఠాధిపతి జన్మదిన వేడుకలతో సందడి
- నిరుపేదలకు స్వామీజీ చేతుల మీదుగా వస్త్రదానం
- భక్తులకు భారీ ఎత్తున అన్నసమారాధన

పెందుర్తి: చినముషిడివాడలోని శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం పెందుర్తి ప్రాంతంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఎన్ఏడీ నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డు మీదుగా చినముషిడివాడలో స్వామీజీకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ భక్తులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పీఠాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ జన్మదిన వేడుక శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. చినముషిడివాడలోని శారదాపీఠంలోని దేవతామూర్తులకు స్వామీజీ ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం పీఠ ప్రాంగణంలో భక్తులు స్వామీజీకి ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ పాదపూజ చేసి ఆశీర్వచనం తీసుకున్నారు. స్వామీజీ పేరిట ప్రత్యేక పూజలు, హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామీజీ ఆశీర్వచనం కోసంతెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి ప్రముఖులు, పుణ్యక్షేత్రాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, వందలాదిగా భక్తులు తరలివచ్చారు. పీఠంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు భారీ ఎత్తున అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామీజీ చేతుల మీదుగా వందలాది మంది నిరుపేద మహిళలకు వస్త్రదానం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ స్వామీజీ అందిస్తున్న సేవలను కొనియాడారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఉదయం నుంచి సాయంత్రం వరకు పీఠంలో ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోడిగుడ్ల దేవిసాంబ, కార్పొరేటర్ ముమ్మన దేముడు, వార్డుల ఇన్‌చార్జిలు మెంటి మహేష్, దాసరి అన్నపూర్ణ, వైఎస్సార్‌సీపీ నేతలు సియాద్రి బాలచంద్ర, మళ్ల తుల సీరాం తదితరులు పాల్గొన్నారు.

సహకార రంగానికి సీఎం వైఎస్ జగన్ చేయూత



సహకార(పీఏసీఎస్) పతాకం ఆవిష్కరిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ నరసింహమూర్తి, అధికారులు

పెందుర్తి: సహకార రంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిస్థాయిలో చేయూతనందిస్తున్నారని పీఏసీఎస్ చైర్మన్ శరగడం నరసింహమూర్తి అన్నారు. 70వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో బాగంగా పెందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మరింత విస్తృతంగా సేవలు అందించేందుకు సంఘాన్ని చురుగ్గా నడుపుతామన్నారు. త్వరలో కంప్యూటరీకరణ ద్వారా సేవలు అందించనున్నట్టు చెప్పారు. రాష్ట్ర సహకార యూనియన్ విద్యాధికారి(లైక్చరర్) జి.సోమేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సహకార రంగానికి అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ప్రస్తుత సహకారం రంగం ఆర్థిక స్థితి, సభ్యులకు అందిస్తున్న సేవలను వివరించారు. కార్యాలయం ఆవరణలో సహకార రంగ పతాకం ఆవిష్కరించారు. సంస్థ కార్య నిర్వహణ అధికారి జి.శంకర్రావు, అకౌంటెంట్ కె.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా తిరువీధి



తిరువీధిలో స్వామివారి ఉత్సవమూర్తులు



తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

సింహాచలం: వృశ్చిక సంక్రమణాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి తిరువీధి ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో అదిష్టింపజేసి సింహగిరి మాడవీధుల్లో సాయంత్రం తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తరించారు.

అయ్యప్ప సన్నిధిలో నగర సంకీర్తన



సుజాతనగర్ అయ్యప్పస్వామి ఆలయంలో నగర సంకీర్తన చేస్తున్న భక్త బృందం, అయ్యప్పకు అభిషేకం

పెందుర్తి: సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కళ సమేత అరి ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో సత్యసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నగర సంకీర్తన నిర్వహించారు. భజనలతో అయ్యప్పను కీర్తించారు. ముందుగా ఆలయ ధర్మకర్త, గురుస్వామి వాకా చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మణికంఠకు అభిషేకాలు, పూజలు చేశారు.

పినగాడిలో నేడు రీ సర్వే

పెందుర్తి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వేలో భాగంగా శనివారం పినగాడి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 7, 164, 166, 167, 217, 225 లలో సర్వే నిర్వహించనున్నట్లు వీఆర్వో సుబ్బారావు తెలిపారు. సంబంధిత సర్వే నెంబర్‌లలో భూములు కలిగిన రైతులు తగిన రికార్డులతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు.

నేడు ఆత్మీయ ప్రార్థనాయోధుల సదస్సు

పెందుర్తి: సుజాతనగర్‌లోని అగాపే క్రిస్టియన్ ప్రేయర్ హౌస్ ఆధ్వర్యంలో శనివారం ఆత్మీయ ప్రార్థనా యోధుల సదస్సు నిర్వహించనున్నట్లు చర్చి పాస్టర్ రెవ.తోమస్ ప్రవీణ్ తెలిపారు. సుజాతనగర్‌లోని ఇంద్రాణి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెవ.డాక్టర్ ఎం.ఎ పాల్, సిల్వి కొత్తపల్లి వాక్యోపదేశాలు చేస్తారన్నారు. సాయంత్రం 6 గంటలకు ఉజ్జీవ ప్రార్థన మహోత్సవంలో సిల్వి కొత్తపల్లి ఏసు వాక్యోపదేశం చేస్తారని వెల్లడించారు. క్రైస్తవులంతా హాజరు కావాలని కోరారు.

మర్యాదపూర్వక కలయిక



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాధ

విశాఖ విద్య : జిల్లా వృత్తి విద్యా శాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన బి.రాధ శుక్రవారం కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, డీవీఈవోగా బాధ్యతలు చేపట్టినట్లు తెలియజేశారు. వృత్తి విద్య కళాశాలల అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సూచించారు.

రైళ్లలో పేలుడు పదార్థాల రవాణా నేరం

డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: ప్రయాణికులు రైళ్లలో ప్రయాణించేటపుడు ఎట్టి పరిస్థితుల్లోనూ పేలుడు, మండే స్వభావం గల పదార్థాలను తమతో తీసుకెళ్లరాదని, ఇది ప్రమాదకరమని, శిక్షార్హమైన నేరమని డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తెలియజేశారు. ఇటీవల కాలంలో రైళ్లలో జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా టపాసులు, గ్యాస్ సిలిండర్లు, యాసిడ్, కిరోసిన్, పెట్రోల్ వంటి వాటిని రైళ్లు, రైల్వే స్టేషన్లలోనికి తీసుకురావొద్దన్నారు. ఇలా చేసిన వారికి మూడేళ్ల వరకు జైలు, జరిమానా విధించే అవకాశముందని ఆయన చెప్పారు. వీటి వల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ విషయంలో వాల్తేర్ డివిజన్ ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరితోపాటు సివిల్ డిఫెన్స్ సభ్యులు, టీటీఈలు, కోచ్ అటెండెంట్స్, ట్రైన్ మేనేజర్లు, స్టేషన్ మేనేజర్లు కూడా తరచూ తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పేలుడు పదార్థాలు రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటివి గుర్తించిన వారు వెంటనే రైల్వే అధికారులకు, రైళ్లలో ఉండే సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. ప్రయాణికుల సహాయం కోసం 139 నంబర్‌ను సంప్రదించాలని డీఆర్ఎం సూచించారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన జోగారావు

పరవాడ: మద్యానికి బానిస కావడంతో పాటు అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని వెన్నలపాలెం గ్రామంలో శుక్రవారం వెలుగు చూసింది. ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి ఇచ్ఛాపురం ప్రాంతానికి చెందిన డి.జోగారావు(42)గా పోలీసులు గుర్తించారు. దీనికి సంబంధించి పరవాడ ఎస్ఐ మల్లేశ్వరరావు అందించిన వివరాలు.. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన జోగారావు పదేళ్ల నుంచి ఎన్టీపీసీలో లేబర్‌గా పనిచేస్తూ వెన్నలపాలెంలో అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. మద్యానికి బానిసైన జోగారావు తెలిసిన వారందరి వద్ద రూ.6 లక్షల మేర అప్పులు కూడా చేశాడు. అప్పులు తీర్చాలని వారు ఇటీవల జోగారావుపై ఒత్తిడి తెస్తున్నారు. అప్పు తీర్చకపోవడంతో అతని ద్విచక్ర వాహనం కూడా పట్టుకుపోయారు. దీంతో జోగారావు మద్యానికి పూర్తిగా బానిసగా మారాడు. రెండు రోజులుగా ఇంటి వద్ద జోగారావు కనిపించకపోవడంతో యజమాని శుక్రవారం సాయంత్రం కిటికిలోంచి లోపలికి చూశాడు. జోగారావు గదిలో సీలింగ్ ఫ్యానుకు ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. వెంటనే పరవాడ పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్ఐ మల్లేశ్వరరావు జోగారావు మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడికి భార్య ముగ్గురు సంతానం. భార్యా పిల్లలు ఇచ్ఛాపురంలో నివాసం ఉంటున్నారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మల్లేశ్వరరావు చెప్పారు.

ఉద్యోగుల స్పందనకు 46 వినతులు



ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న డీఆర్‌వో మోహన్‌కుమార్

మహారాణిపేట : కలెక్టరేట్ ప్రాంగణంలోని డీఆర్వో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగుల స్పందనకు 46 వినతులు వచ్చాయి. జిల్లా, మండల కార్యాలయాల్లో విధుల నిర్వహించే వివిధ క్యాడర్లకు చెందిన ఉద్యోగులు పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఫిర్యాదులను అందజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్‌కుమార్, ఏవో ఈశ్వరరావు ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించారు. నిర్ణీత కాలంలో వీటికి పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని డీఆర్వో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సౌకర్యార్థం ప్రతి నెలా మూడో శుక్రవారం ఉద్యోగుల స్పందన నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

నేడు ఏయూలో జాబ్‌మేళా

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఎంప్లాయ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు బ్యూరో డిప్యూటీ చీఫ్ దొరబాబు తెలిపారు. హెటిరో సంస్థ క్వాలిటీ కంట్రోల్ విభాగంలో 25 ఖాళీల భర్తీకి ఫార్మసీ కోర్సులు, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ చేసిన వారు అర్హులు. వీరికి రూ.2.7 లక్షల వార్షిక వేతనం అందిస్తారు. జూనియర్ కెమిస్ట్‌లో 50 ఖాళీలు భర్తీ చేయనున్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ అభ్యర్థులు అర్హులు. జూనియర్ టెక్నీషియన్ ఉద్యోగాలకు ఐటీఐ ఫిట్టర్, మెకానికల్ డిప్లమో చేసిన వారు అర్హులు. మెడ్‌ప్లస్ సంస్థలో ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు ఫార్మసీ చదివిన వారు, ఫార్మసీ ఎయిడ్, సీఎస్ఏ, ఆడిట్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్ అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.12 వేలు నుంచి రూ.18 వేల వరకు వేతనం ఇవ్వనున్నారు. పూర్తి వివరాలకు 9666092491 నంబరులో సంప్రదించాల్సిందిగా దొరబాబు కోరారు.

వచ్చే నెల 17న వైజాగ్ మారథాన్



టీషర్ట్, మెడల్స్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ రవిశంకర్, నిర్వాహకులు

విశాఖ స్పోర్ట్స్: సాగరతీరంలో డిసెంబర్ 17న వైజాగ్ మారథాన్ జరగనుంది. వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ పరుగు నాలుగు విభాగాల్లో నిర్వహించనున్నారు. 21 కిలోమీటర్ల పరుగుతో పాటు 10 కి.మీ., 5 కి.మీ., 3 కి.మీ. పరుగు పార్క్ హోటర్ దరి వైఎస్సార్ విగ్రహం చెంత ప్రారంభించి అక్వేరియం, రోప్ వే మీదుగా రాడిసన్ హోటల్ వద్ద టర్న్ తీసుకుని తిరిగి వీఎంఆర్డీఏ పార్క్ వద్దకు చేరుకోవడంతో ముగియనుంది. ఈ సందర్భంగా శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ మాట్లాడుతూ క్రీడలు జీవితంలో అంతర్భాగంగా చేసుకోవాలన్నారు. వైజాగ్ మారథాన్ నిర్వాహకులు ఔత్సాహికులకు అందించే టీషర్ట్, మెడల్స్‌ను ప్రదర్శించారు. అల్పాహారాన్ని ఔత్సాహికులకు అందిస్తామని, దారి వెంట వైద్య సహాయకులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైజాగ్‌మారథాన్.కామ్ వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

వ్యాసరచన పోటీలకు విశేష స్పందన



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సబ్బవరం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వి. శిరీష ఆధ్వర్యంలో సెల్ ఫోన్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు-లాభాల అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు వారోత్సవాల ముగింపు వేడుకల్లో బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రాధ,నాగమణి,పాణి తదితరులు పాల్గొన్నారు.

భగీరథ విలాసం నృత్య రూపకం నేడు

మద్దిలపాలెం: నటరాజ్ మ్యూజికల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో భగీరథ విలాసం నృత్య రూపకాన్ని ప్రదర్శించనున్నారు. ప్రముఖ పాత్రికేయుడు అయ్యల సోమయాజుల జోగారావు రచన, ద్వారం త్యాగరాజు సంగీతంలో కూచిపూడి నాట్యకారిణి కె.వి. లక్ష్మి నృత్య పరికల్పనలో ప్రదర్శన జరగనుందని అకాడమీ వ్యవస్థాపకుడు బత్తిన విక్రమ్‌కుమార్ గౌడ్ తెలిపారు.